# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS
www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 13 జనవరి 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 142

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## ఎస్‌బిఐ ఎటిఎం ఛార్జీల పెంపు

2లో..



2లో..

# చలానా పడగానే..
# ఖాతాలో కట్ కావాలి

### ఆ మేరకు బ్యాంక్‌తో అనుసంధానించండి

### అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో సిఎం రేవంత్

'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. "వాహనంపై చలాన్ పడిన వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా చూడాలన్నారు. యజమాని వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించడానికి వచ్చినప్పుడే బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకోండి. ఆ వివరాలు సింక్ చేయండి. చలాన్ పడిన వెంటనే ఆటోమేటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి కట్ కావాలి"




## యూరియా వాడకం తగ్గించండి

### ఆదాతో పాటు ఆదాయం పెరుగుతుంది

### రైతులకు మంత్రి తుమ్మల సూచన

### డ్రోన్ స్ప్రేను ప్రారంభించిన మంత్రి



ఖమ్మం: పంటలకు యూరియా వాడటం వల్లే నష్టం కలుగుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని సూచించారు. అన్నదాతలకు పెట్టుబడి ఖర్చు తగ్గాలని, ఆదాయం పెరగాలని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తే ఆదాతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుత్తిలో డ్రోన్ స్ప్రేను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తాను పురుగులమందులకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు మంత్రి తుమ్మల. పంటకు కొట్టాల్సిన దానికంటే ఎక్కువ పురుగులమందు కొట్టి భూమాతను చంపేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాచురల్ ఫార్మింగే ఉత్తమమని.. దీనిపై రైతన్నలు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పురుగులమందుల డూప్లికేట్ కంపెనీలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పంటలకు ఎక్కడ, ఏ తెగులు ఉందని శాటిలైట్ ద్వారా సమీక్షించి రైతుకు చెప్పాలని అనుకుంటున్నామని తెలిపారు. దానికి కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంటున్నామని వెల్లడించారు. అన్నదాతలందరికీ అధికారులు డ్రోన్ల మీద అవగాహన కల్పించాలని సూచించారు. తాను పంటలకు యూరియా వేయనని, యూరియా వేయకపోతే పురుగుమందు వాడాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. యూరియా ఎంత కావాలంటే అంత ఇస్తామని, కానీ అది పంట చేలకు అరిష్టమని తెలిపారు.

ప్రతిపక్షాలు యూరియా మీద పబ్బం

గడపాలని చూస్తున్నాయని విమర్శలు గుప్పించారు. పామాయిల్, కొబ్బరికి డ్రోన్ అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా మిషన్లు కనిపెట్టాలని శాస్త్రవేత్తలను కోరారు. అన్ని దేశాల్లో మన దేశం నంబర్ వన్ అని, అన్ని రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్ర నంబర్ వన్‌గా ఉండాలనేదే తన ఆకాంక్షని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.



2లో..

# అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు

### గులాబీ మయం అయిన పాలమూరు జిల్లా

ఎరువుల ఇవ్వలేని వాడు...ఏం ఉద్ధరిస్తాడు

గెలిచిన సర్పంచ్‌లతో కెటిఆర్ ఆత్మీయ సమ్మేళనం

ఆనాటి వైభవం అంతా కాలగర్భంలో కలిసిందని విమర్శలు



2లో..

## పక్కాగా పనిదినాలు.. కూలీ అమలు

గుంతలు తవ్వే కార్యక్రమానికిచెల్లుచీటీ

వ్యవసాయానికి ఉపాధిహామీ జోడింపు

జీ రామ్ జీ పథకంపై దుష్ప్రచారం తగదు

పాక్, బంగ్లాలో హిందూమహిళలను ప్రధానిని చేయమంటారా

ఓవైసీ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి సవాల్

## సుప్రీం సాక్షిగా రేవంత్ ద్రోహబుద్ధి

### పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌కు లైన్ క్లీయర్

### అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు ద్రోహం

### మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ



హైదరాబాద్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలయ్యిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ కేసులో తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సోమవారం సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఈ విషయంపై హరీష్ రావు ఒక వీడియోను విడుదల చేశారు. నాడు బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు స్టే సాధిస్తే, ఇక్కడి చేతగాని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ మాత్రం దానికి ఉత్తమ్ కుమార్ సూటు బూటు వేసుకొని ఢిల్లీ దాకా పోవాల్సిన అవసరం ఉందా? అంటూ ప్రశ్నించారు. సివిల్ సూట్ ÷ల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమేనని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథేనని అన్నారు.బలహీనమైన రిట్టు వేసి సంక్రాంతి పండుగ సందర్భంగా రేవంత్ చంద్రబాబుకు గురు దక్షణ చెల్లించుకున్నాడని విమర్శించారు.

గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. తప్పకుండా పోరాటం చేస్తామని హరీష్ రావు వెల్లడించారు.

# రాముడి పేరుతో రాజకీయాలు చేసే హక్కు బీజేపీకి ఎవరిచ్చారు.



- శ్రీరాముడేమైనా బీజేపీ పార్టీ సభ్యత్వం తీసుకున్నారా?.
- ఎన్నికల్లో కులం, మతం పేరిట ఆ పార్టీ కుట్రలు.
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

కులం, మతం పేరిట బీజేపి ఎన్నికల్లో కుట్రపూరిత రాజకీయాలు చేస్తుందని, శ్రీరాముడిని వాడుకునే హక్కు బీజేపీకి ఎవరిచ్చారని, ఎన్నికల సమయంలో ఏ లెక్కన ఆయనను వాడుకుంటారని, శ్రీరాముడేమైనా బీజేపీ పార్టీలో సభ్యత్వం తీసుకున్నారా అని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందూ దేవతలు శ్రీరాముడు, శివుడు కేవలం బిజెపి వాళ్ళకి వర్తిస్తుందా..? శ్రీరాముడిని, శివుడిని కాంగ్రెస్ పార్టీలోని తాము పూజించమా అని ప్రశ్నించారు. దైవం కులాలు అందరికీ సమానమని, దేవుడి పేరిట కుల రాజకీయాలు మత రాజకీయాలు చేయడం సరికాదని ఆయన తీవ్రంగా విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రం లోనే అత్యధిక స్థానాలు సాధించామని, జిల్లాలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాదించిందన్నారు. ఇక మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీజెండా ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చెప్పారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు మిగతా మూడు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తారని ఆయన స్పష్టం చేశారు. బీఆరెస్ పాలనలో ఆర్థిక విధ్వంసమైన రాష్ట్రాన్ని తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగు చేశామన్నారు. ప్రజలు కోరుకునే వారికే కాంగ్రెస్ బీ ఫాంలు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన, ఐటీ మంత్రిగా ఉన్న కేటీఆర్ పది వేల కోట్లు కూడా పెట్టుబడులు తేలేదన్నారు. రేవంత్ సిఎంఅబశ్రీశ్రీ అయ్యాక లక్షా 70 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారన్నారు. 5 లక్షల పై చిలుకు కోట్లు గ్లోబల్ సమ్మిట్ ద్వారా పెట్టుబడులు

**పెట్టేలా ఒప్పందం**

చేసుకున్నామన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎక్కడా ఇవ్వడం లేదని, కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే పేదలకు సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. ఎన్నికలు రాగానే బీజేపి మతం పేరిట, రాముడి పేరిట ఓట్లడుగుతూ లబ్ది పొందాలనుకోవడం శోచనీయం అన్నారు. ఉద్యోగాలిస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారన్నారు. దేవుడి పేరిట కాకుండా 12 ఏండ్లలో చేసిన అభివృద్ధి గురించి చెప్పి బీజేపి పార్టీ నేతలు రాబోయే ఎన్నికల్లో ప్రజలకు ఓట్లడగాలని పేర్కొన్నారు.



2లో..

## పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం విచారణ

### విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి

### తెలంగాణకు సుప్రీం ధార్మసనం సూచన

### కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం: ఉత్తమ్

## ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుక

### డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్: సంక్రాంతి వేళ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2024 జులై 1 నుంచి వర్తించనుంది. జనవరి నెల వేతనంతో పెరిగిన డీఏను ప్రభుత్వం ఫిబ్రవరి 1న చెల్లించనుంది. 2023 జులై 1 నుంచి గతేడాది డిసెంబర్ 31 వరకు ఉన్న డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనుంది.సోమవారం సాయంత్రం అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. 2023, జులై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2026 జనవరి మాసంలో తీసుకునే జీతంతో కలిపి ఈ డీఏ చెల్లించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వివరించింది. జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఉద్యోగులకు సైతం ఈ డీఏను వర్తింప చేయనున్నారు. యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఈ డీఏ కింద నిధులు చెల్లించనున్నారు. 30.03 శాతం నుంచి 33.67 శాతానికి ఈ డీఏను ప్రభుత్వం సవరించిన విషయం విదితమే.

వేగుచుక్క

# అద్భుత రాజధానిగా నిర్మించి చూపుతాం

**ప్రాయోజిత పథకాల నిధుల ఖర్చులో నిర్లక్ష్యం**
**ప్రజల సొమ్ము మురిగిపోతే బాధ్యులెవరని ప్రశ్న**
**నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని ఆదేశం**
**అధికారుల తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు**




అమరావతి: కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు సరిగా ఖర్చు చేయకపోవడంపై సీఎం చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు , విభాగాధిపతులతో జరిగిన కీలక సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా ప్రజల సొమ్ము మురిగిపోయేలా చేసే హక్కు ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు. ఈనెల 15వ తేదీ డెడ్‌లైన్‌గా ఇచ్చినా ఎందుకు ఖర్చు చేయడం లేదని సీఎం నిలదీశారు. సామాజిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల్లో నిధులు ఎక్కువగా మిగిలి పోయాయని ముఖ్యమంత్రి ఆగ్రహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో సుమారు రూ.320 కోట్లు ఉంటే కేవలం రూ.120 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా అన్ని నిధులు పూర్తిగా ఖర్చు చేయాలని, లేకపోతే వెంటపడతామని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి మొదటి, రెండో వారాల్లో పెట్టి, మార్చి 15 నాటికి అంతా ముగించాలని ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మార్చి 15 నుంచి సెక్రటరీలు ఢిల్లీ వెళ్లి డబ్బులు తెస్తారని చూస్తుంటే ఇలా చేస్తారా అని నిలదీశారు. ఇలా అయితే వారానికి ఒకసారి మీటింగ్ పెట్టాలా? అని ప్రశ్నించారు. అన్ని శాఖలతో పోల్చిత్తే ÷నాన్స్ శాఖ మాత్రం బాగా పనిచేస్తోందని ప్రశంసించిన సీఎం... వారే ఇతర శాఖల వెంటపడుతున్నారని తెలిపారు. ఈనెలాఖరులోగా కేంద్ర పథకాల డబ్బులు ఖర్చు చేసి, మార్చి నాటికి అందరూ ఢిల్లీ వెళ్లి డబ్బులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రజల ఆశలను నిలబెట్టామని.. వారిలో విశ్వాసాన్ని మళ్లీ కల్పించామని సీఎం చంద్రబాబు అన్నారు. 2025 ఏడాది మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామన్నారు. సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని.. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దామన్నారు. జీఎస్‌డీపీ, ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర అంశాలపై చర్చించారు.

తల్లికి వందనం ద్వారా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేశామని సీఎం అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా 3.5కోట్ల మంది మహిళలు ప్రయాణాలు చేశారని.. దీనికోసం ఇప్పటి వరకు రూ.1,114 కోట్ల వ్యయం చేశామని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద 46లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు ఖాతాల్లో వేశామని వివరించారు. ఏడాదిన్నరలో 50వేల కోట్ల మేర పింఛన్లు అందించడంతో సంక్షేమంలో కొత్త మైలురాయిని సాధించామని సీఎం పేర్కొన్నారు.

**అమరావతిని శ్మశానం..ఎడారి అని అన్నారు**
**వృధా జలాలను వాడుకుంటే తప్పేంటి**
**అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు**

అమరావతి: రాజధాని అమరావతిని శ్మశానం, ఎడారి అని గతంలో హేళన చేశారని.. కానీ ఇదో స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని సిఎం చంద్రబాబు చెప్పారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. అధికారులతో సమీక్షలో సిఎం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు అని.. అది పూర్తయితే దక్షిణ భారతంలో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చెప్పారు. నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని సీఎం గుర్తుచేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాపాడుకున్నామని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ అని.. ఆ ఎ÷-లాంట్‌ను నిలబెట్టి తీరుతామన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని తెలిపారు. పెట్టుబడులకు డెస్టినేషన్‌గా రాష్ట్రం మారిందన్నారు. ఎస్ఐపీబీ ద్వారా రూ.8.74లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని.. వాటి ద్వారా కూడా పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్నారు.

# పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం విచారణ



న్యూఢిల్లీ: పోలవరం – నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది.. ఈ విచారణకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంలో తెలంగాణ సర్కార్ రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవాలని కూడా మార్గనిర్దేశంచేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వద్ద తెలంగాణ వాదనలు వినిపించుకోవచ్చనీ అభిప్రాయపడింది.అయితే.. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ తమ వాదనలు వినిపిస్తానని గత విచారణ సందర్భంగా సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని తెలంగాణ సర్కార్‌కు తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది అబిషేక్ మను సింఘ్వీ మరోసారి వాదనలు వినిపిస్తున్నారు.పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో పేర్కొంది తెలంగాణ. అయితే.. వరద జలాలను మాత్రమే తాము వాడుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బదులిచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని తెలంగాణా సర్కార్ పిటిషన్‌లో ప్రస్తావించింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదిం చిందని చెబుతోంది. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి లేఖ రాసింది. పోలవరం నల్లమల్ల సాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది తెలంగాణ. తమ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరింది.కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం అని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపాం. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలు.. కానీ ఎక్కువగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాం. ముందు డిజైన్ చేసినదానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించాం. పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించాం అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

# అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు



మహబూబ్‌నగర్: అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రంలో ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎరువులే సక్కగ ఇవ్వలేనోడు..ఇక రైతులను ఏం ఉద్ధరిస్తాడని సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డారు.మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. పోరాడి ఓడిన వారిని కూడా అభినందించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్టాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడంపై మాట్లాడారు. 'గతంలో నేను మున్సిపల్ మంత్రిగా పనిచేసిన. 2014 కంటే ముందు మహబూబ్ నగర్ పట్టణం ఎట్లుండే ఇయ్యాల ఎట్లున్నది.. అనేది చూస్తున్న మీ అందరికీ తెలుసు. ఒక్క మహబూబ్‌నగరే కాదు, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ ఇలా ఈ జిల్లాలో ఏ పట్టణం చూసినా ఎట్ల అభివృద్ధి చెందినయో మీరందరూ చూసిండ్రు. ఈ పట్టణాలు 2014కు ముందు ఎట్టుండె, ఇప్పుడు ఎట్టున్నయో మీరు గమనించండి. కేసీఆర్ నాయకత్వంలో ఒక్కటి రెండు కాదు, అన్ని పట్టణాలను అభివృద్ధి చేసుకున్నం. అన్ని పల్లెలను అభివృద్ధి చేసుకున్నం' అని చెప్పారు. 'పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల కింద.. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసినం. సరే అసెంబ్లీ ఎన్నికల్లో మనం కొద్ది తేడాతో ఓడిపోయినం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఒక్క పని కూడా కొత్తగా చేసింది లేదు. పల్లెల్లో కేసీఆర్ నాయకత్వంలో ట్రాక్టర్‌లు పెట్టి, నీటి ట్యాంకర్‌లు పెట్టి, చెట్లు పెట్టి, ఇంటింటికి నల్లా పెట్టి, ప్రతి పల్లె వీధుల్లో స్ట్రీట్ లైట్‌లు పెట్టి, డంపింగ్ యార్డులు పెట్టి, వైకుంఠధామాలు కట్టి, పల్లె ప్రకృతి వనాలు కట్టి బ్రహ్మాండమైన అభివృద్ధిని కేసీఆర్ చూపించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ట్యాంకర్లలో నీళ్లు లేవు, ట్రాక్టర్‌లో డీజిల్ లేదు. వీధుల్లో లైట్లు వెలుగుతలేవ్' అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధిని చూస్తావుంటే తనకు కడుపు నిండిన భావన కలిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇవాళ మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా ఏం చేశారని ప్రశ్నించారు.నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఉమ్మడి నాయకులంతా కలిసి ఇవాళ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడాన్ని మెచ్చుకున్నారు. 'దాదాపు నాలుగైదు కిలోమీటర్లు ర్యాలీ తీశారు. నాకు ఆ ర్యాలీని చూస్తావుంటే 2028 ఎలక్షన్ అయిపోయింది.. మనం గెలిచినాము.. కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి అయినారు అన్నట్లుగా అనిపించింది' అన్నారు. ఆరేడు వేల మోటార్ సైకిళ్లతోటి బ్రహ్మాండంగా ర్యాలీ తీసింద్రని పార్టీ శ్రేణులను ప్రశంసించారు.

'ర్యాలీగా వస్తుంటే శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ హయాంలో మనం నిర్మించిన ఒక్కో ప్రభుత్వ భవనాన్ని చూపిస్తూ వచ్చాడు. అవన్నీ చూస్తే నాకు కడుపు నిండినట్లు అయ్యింది. మహబూబ్‌నగర్ పట్టణం ఒకప్పుడు ఎట్లుండే, ఇప్పుడు ఎట్లున్నదో మీరందరూ చూస్తా ఉన్నారు. ఒక్క మహబూబ్‌నగరే కాదు నారాయణపేటగానీ, జడ్చర్ల అభివృద్ధిగానీ, రహదారుల విస్తరణగానీ, ÷÷-లవోర్లుగానీ, రహదారుల వెంట వీధి వ్యాపారుల కోసం కట్టిన స్ట్రీట్ వెండింగ్ జోన్‌లుగానీ నాడు మనం చేసిన అభివృద్ధికి నిదర్శనం' అన్నారు.

# మా ఐదేళ్ల అప్పులు...మీరు 18 నెలల్లో చేశారు

అమరావతి: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఐదేళ్లలో చేసిన అప్పులతో పోలిస్తే, కూటమి ప్రభుత్వం కేవలం 18 నెలల్లోనే దాదాపు అదే స్థాయి అప్పులు చేసిందని మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంబటి రాంబాబు ఆరోపించారు. జగన్ హయాంలో మొత్తం ఐదేళ్లలో రూ.3.32 లక్షల కోట్ల అప్పులు చేస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో 18 నెలల్లోనే రూ.3.02 లక్షల కోట్ల అప్పులు చేశారని అంబటి రాంబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు అంటే జగన్ హయాంలో చేసిన అప్పుల్లో దాదాపు 90 శాతం అప్పులను కేవలం ఏడాదిన్నరలోనే చేశారని అన్నారు. జగన్ అప్పులు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని చెప్పిన వారు, చంద్రబాబు అప్పులు చేస్తే రాష్ట్రం సింగపూర్ అవుతుందా అంటూ ప్రశ్నించారు. కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.69 వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చిందని, 90 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించగలిగామని అంబటి గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చినా, కూటమి ప్రభుత్వ హయాంలోనే దాదాపు రూ.20 వేల కోట్ల విద్యుత్ భారం ప్రజలపై మోపారని ఆరోపించారు. అలాగే ఎన్నికల హామీలను ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇక, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు 'టైగర్ ఆఫ్ మార్షల్' అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన అంబటి, ఆయనకు అనేక సామర్థ్యాలు, కళలు ఉన్నాయని ప్రశంసించారు. అయితే పవన్‌ను అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జనసేన నేతల నెత్తిన ఎక్కి టీడీపీ నేతలు ఆడుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగుళూరులో ఉంటూ వైఎస్ జగన్.. కుట్రలు చేస్తున్నారన్న ఆరోపణలపై స్పందించిన అంబటి, జగన్‌కు ఇక్కడే శాశ్వత నివాసం ఉందని తెలిపారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌ల శాశ్వత నివాసాలు ఎక్కడున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. మీరు నదీ గర్భంలో ఉన్న ఇంట్లో ఉంటున్నారు అంటూ విమర్శలు చేశారు. జగన్ ప్రతీ వారం రాష్ట్రానికి వచ్చి ప్రజలతో మమేకమవుతున్నారని తెలిపారు. టీడీపీ నేతలు కడుపు మంటతో మాట్లాడుతున్నారని, జగన్ మాత్రం స్ట్రెయిట్ పాలిటిక్స్ చేస్తారని అన్నారు. డొంక తిరుగుడు రాజకీయాలు జగన్ చేయరని స్పష్టం చేశారు. సత్తెనపల్లిలో ఆరేళ్ల పాటు ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించామని, గత ఏడాది కొన్ని పరిస్థితుల వల్ల చేయలేకపోయామని తెలిపారు. ఈ ఏడాది ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామని, తమ సంక్రాంతి వేడుకలకు పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. మరోవైపు.. దైవాన్ని అడ్డం పెట్టుకుని తుచ్ఛమైన రాజకీయాలు చేస్తున్నారని చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. జగన్‌ను హిందూ వ్యతిరేకిగా ముద్ర వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మీ కుట్రలను వెంకటేశ్వర స్వామి కూడా క్షమించడు అంటూ అంబటి రాంబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# అశాస్త్రీయంగా జిల్లాల విభజన



హైదరాబాద్: తెలంగాణలో గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలు, మండలాలను రేషనలైజ్ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ టీజీఓ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పాలనలో సమస్యలు సృష్టించిన ఈ జిల్లాల ఏర్పాటును సమీక్షించి సరిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాష్ట్రంలోని పాలనా వ్యవస్థను మరింత సమర్థవంతం చేయడానికి అవసరమన్నారు.గత ప్రభుత్వం అశాస్త్రీయంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం వల్ల పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అభిప్రాయాలు స్వీకరిస్తుందని చెప్పారు. రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం వెల్లడించారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని.. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి త్వరలో రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ కమిషన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కమిషన్ ఆరు నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ పై నివేదిక సమర్పిస్తుందని సీఎం చెప్పారు. అన్ని జిల్లాల్లో మండలాలు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే, బ్జడెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని, విధివిధానాలు రూపొందిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ సారథులుగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. 'మా ప్రభుత్వ వారదులు.. సారథులు ప్రభుత్వ ఉద్యోగులే. ఆనాడు ప్రభుత్వం తప్పుడు పనులను ఉద్యోగులపై ఒత్తిడి చేసి అమలు చేయించింది. పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తి ఫామ్ హౌజ్‌లో పడుకున్నారు' అని రేవంత్ రెడ్డి విమర్శించారు. 'నేను అన్నగా వచ్చాను. ఇప్పుడు నేను 18 గంటలు పనిచేస్తున్నాను. ఈరోజు డీఏ ÷ల్ మీద సంతకం చేసి వచ్చాను. దీంతో ప్రభుత్వానికి రూ.227కోట్ల భారం పడుతుంది' అని రేవంత్ రెడ్డి ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు.ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రతీ ఉద్యోగికి రూ.1.02 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తాం. ఉద్యోగులు, ప్రభుత్వం వేరువేరు కాదు. ఇద్దరం కలిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి' అని సీఎం అన్నారు. అలాగే, భూములు, ఇసుక, ఉ÷ సబ్సిడీలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని నిరోధిస్తే ప్రభుత్వ ఆదాయం మెరుగవుతుందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. తాను ఇప్పటివరకు ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తీసుకుందామని అనుకున్నా.. ఏదో ఒక పని వచ్చి పడుతోందన్నారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వ సారథులు, వారధులు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం. ఉద్యోగుల్లో కూడా నేను అంటే నచ్చని వారు చాలా మంది ఉండొచ్చు. నేను వచ్చాక ఉద్యోగుల జీతాలు ఎలా వస్తున్నాయో మీరే గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఇక్కడికి వచ్చాను. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించాం.




# చలానా పడగానే.. ఖాతాలో కట్ కావాలి

హైదరాబాద్: వాహనాలకు చలానాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసులకు కీలక సూచనలు చేశారు. అవి ఎంతోకాలం పెండింగ్‌లో లేకుండా వెంటనే వారి ఖాతాల నుంచి కట్ అయ్యేలా చూడాలన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. వాహనం పై చలాన్ పడిన వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా చూడాలన్నారు. యజమాని వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించడానికి వచ్చినప్పుడే బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకోండి. ఆ వివరాలు సింక్ చేయండి. చలాన్ పడిన వెంటనే ఆటోమేటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి కట్ కావాలని రేవంత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీలో 3 శాతం మేర నష్టం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతోందని, 3 నిమిషాలకో ప్రాణం పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద నివారణకు పోలీసుశాఖ ప్రణాళిక చేపట్టిందన్నారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. సమాజంలో కొందరి నిర్లక్ష్యం మరొకరికి ప్రాణాపాయంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి. ఫిజికల్ క్రైమ్‌తో పాటు సైబర్ నేరాలు భారీగా పెరిగిపోయాయి. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. వీటి నియంత్రణలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇందులో పోలీసులు, రవాణా శాఖ పని మాత్రమే కాదు.. ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతేడాది రోడ్డు ప్రమాదాలు పెరిగినా.. విస్తృత అవగాహనతో మరణాల సంఖ్య తగ్గిందని చెప్పారు.

# పక్కాగా పనిదినాలు..కూలీ అమలు

హైదరాబాద్: వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత లేకుండా.. వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తామన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశం. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాంఅని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వీబీ–జీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు.

గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి. రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. భాజపా గాలివాటంతో గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడుసార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు.

# ఎస్‌బిఐ ఎటిఎం ఛార్జీల పెంపు

న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బిఐ ఇటీవల ఎటిఎం ట్రాన్సాక్షన్ ఛార్జీలను పెంచింది. ఇంటర్‌ఛేంజ్ ఫీజ్ పెరిగిన నేపథ్యంలో ఈ పెంపు అనివార్యమైందని బ్యాంకు ప్రకటించింది. కొత్త ఛార్జీలు డిసెంబర్ 1నుంచి అమలులోకి వచ్చాయి. ఇదే తరహాలో గతేడాది ఫిబ్రవరి తర్వాత కూడా ఛార్జీలు పెంచిన సంగతి తెలిసిందే.సేవింగ్స్ అకౌంట్ హోల్డర్లు: ఇతర బ్యాంకుల ఎటిఎంలలో నెలకు 5 ఫ్రీ ట్రాన్సాక్షన్లు చేసుకోవచ్చు. ఫ్రీ లిమిట్ అయిపోయాక.. క్యాష్ విత్‌డ్రాయల్ కు రూ.23 చొప్పున వసూలు చేస్తారు. ఇక, బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, మినీ స్టేట్‌మెంట్ వంటి నాన్-÷నాన్షియల్ లావాదేవీలకు రూ.11 ఛార్జీలుగా వసూలు చేస్తారు.శాలరీ అకౌంట్ హోల్డర్లకు గతంలో అన్‌లిమిటెడ్ ఫ్రీ ట్రాన్సాక్షన్లు ఉండేవి. ఇప్పుడు నెలకు 10 ఫ్రీ ట్రాన్సాక్షన్లు మాత్రమే కల్పించారు. దాని తర్వాత సేవింగ్స్ ఖాతాదార్ల మాదిరే రూ.23 ,ఇంకా రూ. 11 చెల్లించాలి. అయితే, సొంత ఎటిఎంలలో ఛార్జీలు మారలేదు. ఫ్రీ ట్రాన్సాక్షన్లూ పాత పద్ధతిలో అలాగే ఉన్నాయి. సేవింగ్స్ ఇంకా శాలరీ అకౌంట్ హోల్డర్లు ఫ్రీ లిమిట్ దాటినప్పుడు మాత్రమే ఎక్స్‌ట్రా ఛార్జీలు చెల్లించాలి. కరెంట్ అకౌంట్ హోల్డర్లు కూడా ఛార్జీల పెంపునకు ప్రభావితమవుతారు.

వేగుచుక్క

# మాటల గారడి కాంగ్రెస్ ప్రభుత్వం.






**రెండున్నర ఏళ్లలో సీడీపీ నిధులు శూన్యం.**

**హామీలు నెరవేర్చకుండా కార్పొరేషన్ ఎన్నికల్లో ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారు.**

**హిందూ దేవుళ్ళ జోలికి వస్తే సహించేది లేదు.**

**మీడియా సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

రెండున్నర ఏళ్లలో సీడీపీ నిధులు శూన్యం అని, కాంగ్రెస్ ప్రభుత్వం మాటల గారడి తప్పా చేతల ప్రభుత్వం కాదని, హామీలు నెరవేర్చకుండా కార్పొరేషన్ ఎన్నికల్లో ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఎద్దేవా చేశారు. సోమవారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశం కోసం ధర్మం కోసం పని చేస్తున్న ఏకైక పార్టీ బిజెపి అన్నారు. నిజమైన సెక్యులర్ పార్టీ బీజేపీ మాత్రమేనని, కులాలు, మతాలు మరియు రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న పార్టీ బిజెపి మాత్రమే అని అన్నారు.ఓడిన కాంగ్రెస్ అభ్యర్థికి పది కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో తెలుపాలన్నారు. అర్బన్ ను 500 కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చెప్పడం పచ్చి అబద్ధం అన్నారు.



రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వ పథకాలు కాపీ కొడుతున్నారన్నారు. దేశంలో సిడిపి ఫండ్ ఇవ్వని రాష్ట్రం ఏది లేదని, ఒక్క తెలంగాణ రాష్ట్రం మాత్రమే ఇలా వ్యవహరిస్తుంది అని అన్నారు. ఫండ్ లేకుండా గ్రామాలకు ఎలా వెళ్లాలని 26 నెలలుగాకాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా అడగడం విడ్డూరమన్నారు. అర్బన్ లో ముఖ్యమైన అంశాల మీద ఫోకస్ పెట్టి, సమస్యలపై సిఎంకు, మంత్రులకు ఇప్పటివరకు అనేక ఉత్తరాలు రాశారని ఒక్కదానికి కూడా సమాధానం లేదన్నారు.టిఆర్ఎస్ పదేళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వడంలో విఫలమయ్యిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గానికి 3500 ఇండ్లు అని చెప్పి సగం కూడా సాంక్షన్ చేయలేదన్నారు. నిజామాబాద్ బస్టాండ్, ప్రభుత్వాసుపత్రి, కళాభారతి గురించి ఉత్తరాలు రాసిన అటు సీఎం కానీ ఇటు పిసిసి కానీ పట్టించుకోకపోవడం దౌర్భాగ్యం అన్నారు. రేవంత్ రెడ్డి గద్దె కోసం కేవలం హిందూ దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి తర్వాత విమర్శించడం ముమ్మాటికి తగదన్నారు. మహేష్ కుమార్ గౌడ్ రాముడు గురించి మాట్లాడటం మానుకోవాలని హెచ్చరిస్తూ, ఆ రాముడి ఆశీర్వాదంతోనే ప్రపంచంలో అత్యధిక మెంబర్షిప్ మరియు దేశంలో 21 రాష్ట్రాలలో అధికారంలో ఉందన్నారు. ఏమీ చేయని మీకు రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగరవేయడం ఖాయం అన్నారు. నిజామాబాద్ బరాబర్ ఇందూరేనని, కార్పొరేషన్ గెలుచుకోగానే పేరును మార్చే ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. హిందూ దేవతలు అలుకగా దొరికారా. హిందూ దేవుళ్ళ జోలికి వస్తె ఊరుకునేది లేదని హెచ్చరించారు. విలేఖర్ల సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, పోతంకర్ లక్ష్మి నారాయణ, జిల్లా కార్యదర్శి జోతి, నాయకులు న్యాలం రాజు, ప్రమోద్, ప్రభాకర్, తారక్ వేణు, ఇప్పకాయల కిషోర్, బట్టు రాఘవేందర్, మల్లేష్ యాదవ్, పుట్ట వీరేందర్, హరీష్ రెడ్డి, కార్తీక్, మధు, భాస్కర్, విజయ్, వినోద్, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతలపై ప్రజల్లో అవగాహన పెంచాలి.

## - జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 12**





రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తూ, ప్రమాదాల బారిన పడకుండా స్వీయ జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన అధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన పలు వీడియోలను ప్రదర్శిస్తూ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర్ రావు అవగాహన కల్పించారు. జిల్లాలో 2024 సంవత్సరంలో 856 ప్రమాదాలు చోటుచేసుకుని 351 మంది మృతి చెందగా, 2025 నవంబర్ మాసాంతానికి 815 రోడ్డు దుర్ఘటనల్లో 280 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ముఖ్యంగా అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని, ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. అతి వేగం, తాగి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులకు, వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన పెంపొందేలా విరివిగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల తీవ్రతను నిలువరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, తద్వారా ఎన్నో విలువైన నిండు ప్రాణాలను కాపాడగల్గుతామని అన్నారు. అధికారులు అంకితభావంతో కృషి చేస్తూ నిజామాబాద్ ను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎం.వీ.ఐ కిరణ్ కుమార్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల స్ఫూర్తితో.. "సమాజ ప్రగతికి" కృషి చేయాలి.

**యువతకు మార్గదర్శకులు స్వామి వివేకానంద, అలిశెట్టి ప్రభాకర్.**

**సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**

**వేగుచుక్క న్యూస్, సిరికొండ:**



భారతదేశంలో నిరాశ, నిస్పృహలు అలుముకున్న కాలంలో దేశానికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు స్వామి వివేకానంద, శ్రమ జీవుల బ్రతుకులను సిరాలో నింపి అక్షరాలతో అగ్గి పుట్టించి, కలంతో కవాతు చేసిన అక్షర సూర్యుడు అలిశెట్టి ప్రభాకర్ లు యువతకు మార్గదర్శకులని, మహనీయుల స్ఫూర్తితో యువత సమాజ ప్రగతికి కృషి చేయాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. భారత దేశ ఔన్నత్యాన్ని, మేధసంపత్తిని, ప్రతిష్టను విశ్వవ్యాపితం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద జయంతి, తెలంగాణ సాహితీ వనంలో పూసిన ఎర్రమందారం, ప్రజాకవి అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిలు మరియు జాతీయ యువజన దినోత్సవాలను పురస్కరించుకొని సోమవారం సత్యశోధక్ పాఠశాలలో స్వామి వివేకానంద,అలిశెట్టి ప్రభాకర్ ల చిత్ర పటాలకు ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, వేదాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసి, కుల, మత, జాతి, లింగ భేదాలు లేకుండా అందరినీ ప్రేమించాలని, దేశభక్తి, ఆత్మవిశ్వాసం, సేవ, ధైర్యం వంటి విలువలు కల్గిన బోధనలు, అలసిపోకు, లేవండి, లక్ష్యం చేరే వరకు ఆపకండి" వంటి స్ఫూర్తిదాయకమైన సూక్తులతో భారతదేశ యువతకు ఆదర్శంగా నిలిచిన మహనీయుడు స్వామి వివేకానంద అని, అక్షరం మండుతున్న అగ్నికణంల, కవిత్వం ఓ పాశుపతాస్త్రంగా, సామాన్యుని కష్టాలే కవితా వస్తువులుగా, కష్టజీవి కన్నీళ్లే ఆ పెన్నుకు ఇంకు చుక్కలుగా రక్తం ఉడికించే మాటలతో మర ఫిరంగుల్లాంటి కవితలు రాస్తూ, అన్యాయాలను ఎదిరిస్తూ, రాజకీయ వ్యంగ్యంలో రాటుదేలిన కలం వీరుడు అలిశెట్టి ప్రభాకర్ అని కొనియాడారు. యువతకు స్ఫూర్తి ప్రదాతలైన స్వామి వివేకానంద, అలిశెట్టి ప్రభాకర్ ల జీవితాలు, రచనలు, ఆదర్శాలు యువతకు మార్గదర్శకంగా నిలవాలనిమహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత శిఖరాలకు ఎదగాలని, దేశ పురోగతికి, యువశక్తియే ప్రధానమని యువత సామాజిక అవగాహనతో నిరంతరం విజ్ఞానాన్ని, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందూరు దంపతులకు జేసీఐ అవార్డులు.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాదు**

జేసీఐ అలుమ్ని క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిజామాబాదుకు చెందిన లావణ్య విజయానంద్ దంపతులకు తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలతో కూడిన జోన్ స్థాయిలో ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి. ఆదివారం రాత్రి హైదరాబాదులో జరిగిన జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అలుమ్ని క్లబ్ జోన్ కాన్ఫరెన్స్-- న్యూస్ 2025 లో ప్రతిష్ఠాత్మక అవుట్‌స్టాండింగ్ జోన్ వైస్ చైర్మెన్ అవార్డు నిజామాబాదుకు చెందిన అలుమ్ని క్లబ్ జోన్ వైస్ చైర్మెన్ జిల్కర్ విజయానంద్ కు దక్కింది. అదే విధంగా అవుట్‌స్టాండింగ్ లేడీ మెంబర్ అవార్డు ఆయన సతీమణి లావణ్యకు లభించింది. గత ఏడాది పొడవునా వివిధ ప్రాజెక్టులు, కార్యక్రమాల ద్వారా వీరిద్దరు చేసిన సేవా కార్యక్రమాలకు గానూ గుర్తింపుగా జోన్ చైర్మన్ డీవీఎస్‌పీ గుప్తా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ నేషనల్ ఆఫీసర్లు సునీల్ కుమార్, వినయ్ మెహతా, మనోజ్ టక్కర్, జీవీఎన్ రాజు, చతుర్వేది, జోన్ అధికారులు నవీన్ చవల్లా, శ్రీనివాస్, శ్యాంసుందర్, బ్రహ్మం, శ్రీపూజ, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి.

## - పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.



**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్:**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలనీ, అందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలో అధ్యక్షులు సాయి బాబా గౌడ్ సోమవారం ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రథసారథి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటిపల్లి నాగేష్ రెడ్డి, తెలంగాణ కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మనలో మోహన్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎబి చిన్న, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, మాజి నిజామాబాద్ గ్రంథలయ చైర్మన్ మరా చంద్ర మోహన్ అతిథులుగా హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని దిశ నిర్దేశం చేయడం జరిగింది. అలాగే 36 వార్డులకు గాను సుమారు 140 అప్లికేషన్లు రావడం జరిగింది దీనిలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సర్వే ఆధారంగా బలమైన అభ్యర్థులను క్యాండిడేట్లుగా ప్రకటించడం జరుగుతుంది. టికెట్ రాణి అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ వారికి వేరే పోస్టులలో ఇప్పియ్యడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ పండిత్ పవన్, అయ్యప్ప శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ జీవన్, కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భారత్ మాకు నిజమైన భాగస్వామి

**నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమే**

**అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహబంధం నిజమైనదని అన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమేనని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగేందుకే వారు ప్రయత్నిస్తారని వ్యాఖ్యానించారు. 'ఇండియాతో భాగస్వామ్యం కంటే మాకు ఎవరూ ఎక్కువ కాదు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరో స్థాయికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తాను' అని గోర్ చెప్పారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం విషయంలో సంక్లిష్టతలు ఉన్నప్పటికీ వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు రెండు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని అన్నారు. ఈనెల 13న భారత్-అమెరికా ప్రతినిధులు మరోసారి సమావేశం కావాల్సి ఉందని వెల్లడించారు. వచ్చే ఏడాది లేదా రెండేళ్లలో ట్రంప్ భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. భారత్‌కు అమెరికా రాయబారిగా ఆయన సోమవారంనాడు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమకు భారత్ తర్వాతే ఎవరైనా అని చెప్పారు. భారతదేశం ప్రపచంలోనే అతిపెద్ద దేశమని, అందువల్ల ఒప్పందంపై ముగింపునకు తీసుకురావడం అంత తేలికైన పనికాదని, అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా ఒప్పందం కుదిరేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. భద్రత, కౌంటర్ టెర్రరిజం, ఇంధనం, సాంకేతికత, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని తెలిపారు. సిలికాన్ ఆధారిత సాంకేతికతలను రక్షించడానికి, మెరుగుపరచడానికి ఉద్దేశించిన 'ప్యాక్స్ సిలికా' కూటమిలోకి పూర్తి సభ్యత్వ దేశంగా భారత్‌ను ఆహ్వానిస్తున్నామని గోర్ వెల్లడించారు. కూటమిలో అమెరికా, జపాన్, సౌత్ కొరియా, యూకే, ఇజ్రాయెల్ దేశాలు కలిసి పనిచేయనున్నట్టు చెప్పారు.


# ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పక్రియలో లోపాలు

## బెంగాల్ సర్ ప్రక్రియపై మమత అభ్యంతరం

కోల్‌కతా: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ పక్రియ కోసం వినియోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. దీంతో నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈమేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ఎస్ఐఆర్ మొదలు సీఈసీకి దీదీ లేఖ రాయడం ఇది ఐదోసారి. కృత్రిమ మేధ ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారు. అయితే, ఈ పక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇది కాస్తా పెద్దఎత్తున డేటా మిస్‌మ్యాచ్‌కు దారితీసింది. దీంతో నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడ్డారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఎన్నికల సంఘం పక్కనపెట్టింది. దీంతో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోంది. ఈసీ తన సొంత పద్ధతులను విస్మరించడం.. ఏకపక్షం, అహేతుకం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.ఎస్ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదు. ఈ పక్రియలోనే లోపం ఉంది. ఎస్ఐఆర్ విచారణ పక్రియ సైతం చాలావరకు యాంత్రికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోంది. సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదు. ఇది మన ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోందని మమతా బెనర్జీ తన లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. బెంగాల్‌లో ఎస్ఐఆర్‌లో భాగంగా 58 లక్షల మంది పేర్లను ఈసీ తొలగించిన విషయం తెలిసిందే.

వేగుచుక్క

# వైభవంగా కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణ



భారతీయ సినీ పరిశ్రమకి అపూర్వమైన సేవలు అందించిన పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో అత్యంత ఘనంగా జరిగింది. కృష్ణ మనవడు ఘట్టమనేని జయకృష్ణ విగ్రహాన్ని ఆవిష్క రించారు.కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరి రావు, నిర్మాత అశ్వినిదత్, సినీ, రాజకీయ ప్రము ఖులు, సూపర్ స్టార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కృష్ణకి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హీరో జయకృష్ణ మాట్లాడుతూ,'నేను ఏం చేసినా తాతయ్య నా పక్కనే ఉంటూ నడిపిస్తుంటారనిపిస్తోంది. ఆయనతో గడిపిన సమయం, ఆయన నాకు చెప్పిన మాటలు, ఎప్పుడూ గుర్తొస్తూనే ఉంటాయి. నా జీవితంలో మరో ముఖ్యమైన వ్యక్తి మా బాబాయ్ మహేష్ బాబు. ఆయన నాకు ఎప్పుడూ గైడెన్స్ ఇస్తారు. నేను ఆయనకి వీరాభిమానిని. చిన్నప్పటి నుంచి ఆయన సినిమాలు చూస్తూనే పెరిగాను. నిన్న ఆయన నా సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ చేశారు. అది నాకు నా జీవితంలో ప్రౌడ్ మూమెంట్. మహేష్ బాబు నా ఇన్స్పిరేషన్. 40 ఏళ్ల క్రితం ఇదేరోజు 'అగ్నిపర్వతం' సినిమా రిలీజ్ అయింది. అశ్వినిదత్ ఆ సినిమాని నిర్మిం చారు. మహేష్ బాబాయ్‌ని కూడా ఆయనే లాంచ్ చేశారు. ఈ ఏడాది ఆయన నన్ను లాంచ్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది.





# బండ్లన్న ట్వీట్...

ప్రాచీన జపనీస్ మార్షల్ ఆర్ట్ కెంజుట్సులో అంతర్జాతీయ గౌరవం సాధించిన పవన్ కళ్యాణ్‌కు నిర్మాత బండ్ల గణేష్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "చరిత్రలు రాసేవాళ్లు ఉంటారౌ చరిత్రనే తుడిచేసేవాడు ఒక్కరే. మార్షల్ ఆర్ట్స్‌కు పులి, పవన్ కళ్యాణ్ సారు అంటూ బండ్ల గణేష్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ అయిన 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొందడం ద్వారా గొప్ప అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన క్రమశిక్షణతో సాగించిన సాధన, పరిశోధన, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ద్వారా ఆయనకు "టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే విశిష్ట బిరుదుతో సత్కారం కూడా చేయటం విశేషం. పవన్ కళ్యాణ్ బహుముఖ ప్రజ్ఞాశాలి. సినీ రంగంలో నటుడిగా చెరగని ముద్ర వేశారు. రచయితగా, దర్శకుడిగా, స్టంట్ కోఆర్డినేటర్‌గా, కొరియోగ్రాఫర్‌గా, గాయకుడిగా ఇలా పలు విభాగాల్లోనూ తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రజా నాయకుడిగా మన్ననలు పొందుతున్నారు. సినిమాలు, రాజకీయాల్లోకి ప్రవేశించకముందే పవన్ కళ్యాణ్ మార్షల్ ఆర్ట్స్ ప్రయాణం ప్రారంభమైంది. జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థగా గుర్తింపు పొందిన సోగో బుడో కన్‌రి క్రై నుంచి పవన్ కళ్యాణ్‌కు ఐదవ డాన్ పురస్కారం లభించడం విశేషం. అలాగే టకెడా షింగెన్ క్లాన్‌లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. అంతేకాదు, గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ పవన్‌ను "టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్సు అనే బిరుదుతో సత్కరించింది.

# ఇప్పటికీ బాధపడుతున్నా



తెలుగు సినీ పరిశ్రమలో గ్లామర్‌కు దూరంగా ఉండి కూడా తన సహజమైన అందం, సున్నితమైన అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న అరుదైన హీరోయిన్లలో లయ ఒకరు. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'స్వయంవరం' సినిమాతో హీరోయిన్‌గా అరంగేట్రం చేసిన లయ, తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత తక్కువ కాలంలోనే వరుస అవకాశాలు అందుకుని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారు.

కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే వివాహం చేసుకుని సినిమాలకు గుడ్‌బై చెప్పిన లయ, ఆ తర్వాత అమెరికాలో స్థిరపడ్డారు. దాదాపు 18 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ తెలుగు సినిమాల్లో రీఎంట్రీ ఇవ్వడం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. నితిన్ హీరోగా నటించిన ' తమ్ముడు ' చిత్రంతో లయ మళ్లీ తెరపై కనిపించారు. ఈ సినిమాలో ఆమె నితిన్ అక్క పాత్రలో నటించి, భావోద్వేగభరితమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అయితే దర్శకుడు శ్రీరామ్ వేణు తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. సినిమా ఫలితం ఎలా ఉన్నప్పటికీ, లయ రీఎంట్రీని మాత్రం ప్రేక్షకులు, సినీ వర్గాలు పాజిటివ్‌గా తీసుకున్నాయి. ఇటీవల కాలంలో తరుచూ ఇంటర్వ్యూలు ఇస్తోన్న లయ తన కెరీర్, జీవితం, రీఎంట్రీపై ఆసక్తికర విషయాలు పంచుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో లయ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ' అరవింద సమేత ' సినిమాలో వచ్చిన అవకాశాన్ని వదులుకోవడమే తన కెరీర్‌లో చేసిన అతి పెద్ద తప్పు అని ఆమె ఓపెన్‌గా చెప్పేశారు. ఆ సినిమాలో జగపతి బాబు భార్య పాత్ర కోసం తనను సంప్రదించారని, కానీ అది చిన్న రోల్ అనుకుని తిరస్కరించానని లయ వెల్లడించారు. "నిజానికి కథను పూర్తిగా వినకుండానే ఆ నిర్ణయం తీసుకున్నాను. తర్వాత ఆ పాత్ర ఎంత పవర్‌ఫుల్‌దో అర్థమైంది. అప్పుడే తెలిసిందొ నేను పెద్ద తప్పు చేశానని" అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



# రొమాంటిక్ టచ్

రవితేజ తన సినిమాల విషయంలో ఎంత మాత్రం గ్యాప్ రానీయడు. అనుకోకుండా ఒక్కోసారి లెక్క తప్పడం వలన, ప్రాజెక్టులు ఆలస్యమవుతూ ఉంటాయే తప్ప, తానుగా ఆలస్యం చేయడమనేది తనకి ఎంతమాత్రం అలవాటు లేని పని. నాన్చడం ఆయనకి ఎంత మాత్రం ఇష్టం ఉండదు. అందువల్లనే ఆయన నుంచి చకచకా సినిమాలు వచ్చేస్తూ ఉంటాయి. అలా ఈ సంక్రాంతికి వస్తున్న సినిమానే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా, ఈ నెల 13వ తేదీన విడుదల కానుంది. రవితేజ కథనాయకుడిగా నటించిన ఈ సినిమాలో, కథనాయికలుగా ఆషికా రంగనాథ్ – డింపుల్ హయతి అలరించనున్నారు. ఈ ఇద్దరితో కలిసి రవితేజ చేసే రొమాన్స్, ఫ్యామిలీ ఆడియన్స్ కి నచ్చేలా కామెడీ టచ్ తో నడుస్తుందని అంటున్నారు. డింపుల్ కి ఉన్న హాట్ ఇమేజ్ .. ఆషికకి గల ఫాలోయింగ్ ఈ సినిమాకి ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్ ల ద్వారా మంచి మార్కులు కొట్టేసిన కిశోర్ తిరుమల ఈ సినిమాకి దర్శకత్వం వహించడం విశేషం.

'నా సామిరంగ' సినిమాలో నాగార్జున సరసన గ్లామర్ పరంగా సందడి చేసిన ఆషికా రంగనాథ్ ఆ తరువాత చేసిన సినిమా ఇది. భార్యకీ .. ప్రియురాలికి మధ్యలో నలిగిపోయే పాత్రలో రవితేజ నటన, అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందని అంటున్నారు. సంక్రాంతి సినిమా నుంచి ప్రేక్షకులు కోరుకునే అన్ని రకాల అంశాలు ఈ సినిమాలో ఉంటాయని చెబుతున్నారు. చూడాలి మరి ఈ సంక్రాంతి బరిలో ఈ సినిమా ఏ స్థాయిలో సందడి చేస్తుందో.



# ఇన్నాళ్లకు న్యాయం జరిగింది

టాలీవుడ్‌లో ఒకప్పుడు యూత్ ఐకాన్‌గా దూసుకెళ్లిన విజయ్ దేవరకొండ ఇటీవల వరుస పరాజయాలతో కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నారు. ఆశించిన స్థాయిలో సినిమాలు ఆడకపోవడం, సోషల్ మీడియాలో ట్రోలింగ్ తీవ్రత పెరగడం విజయ్ కెరీర్‌పై ప్రభావం చూపుతున్నాయి. ప్రతి సినిమా రిలీజ్ సమయంలో నెగిటివ్ క్యాంపెయిన్లు, స్టార్ రేటింగ్స్ పేరిట ముందే తీర్పులు చెప్పడం తనను మానసికంగా ఇబ్బంది పెడుతున్నాయని విజయ్ పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. ఇదే నేపథ్యంలో తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. తెలుగు సినిమా రంగంలో రివ్యూలు, రేటింగ్స్ అంశం కొంతకాలంగా వివాదాస్ప దంగా మారింది.

సినిమా రిలీజ్ అయ్యిందో లేదో వెంటనే మొబైల్ తీసి రేటింగ్స్ చూడటం, వాటి ఆధారంగా థియేటర్‌కు వెళ్లాలా వద్దా నిర్ణయించుకోవడం సాధారణమైపోయింది. కానీ ఈ రేటింగ్స్ వ్యవస్థే సినిమాల పాలిట శాపంగా మారుతోందని పలువురు సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కొందరు పనిగట్టుకుని అవాస్తవాలను ప్రచారం చేయడం వల్ల నిర్మాతలు, దర్శకులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై గతంలో మంచు విష్ణు సుప్రీం కోర్టును ఆశ్రయించి తమ సినిమాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకునే వెసులుబాటు ఇవ్వాలని కోరగా, కోర్టు అనుమతిచ్చింది. ఆ తర్వాత మరికొన్ని నిర్మాణ సంస్థలు కూడా ఇదే బాటలో నడిచాయి. తాజాగా మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకరవరప్రసాద్ గారు చిత్ర బృందం కోర్టును ఆశ్రయించడంతో, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ పోర్టల్స్‌లో రేటింగ్స్ నిలిపివేయాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఈ పరిణామంపై విజయ్ దేవరకొండ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఈ వార్త చూసిన తర్వాత ఒకవైపు సంతోషంగా ఉందొ మరోవైపు బాధ కూడా కలిగింది" అంటూ ఆయన భావోద్వేగంగా స్పందించారు. ఎంతోమంది కృషి, కలలు, పెట్టుబడిని కాపాడేందుకు ఇది కొంతవరకు ఉపయోగపడుతుందని, అయితే సినిమా రంగానికి చెందిన వారే ఇలాంటి సమస్యలను సృష్టిస్తున్నారని తెలుసుకుని బాధపడుతున్నట్లు చెప్పారు. వ్యవస్థీకృతంగా జరుగుతున్న నెగిటివ్ దాడులను గమనించానని, అప్పట్లో తన మాట ఎవరికీ వినిపించలేదని విజయ్ వాపోయారు.



# నవ్వులే నవ్వులు!

ఈ యేడాది సంక్రాంతి బరిలో దిగుతున్న అన్ని చిత్రాలు ఎంటర్ టైన్ మెంట్ ను అందించే విషయంలో ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. మొదటగా వచ్చిన ప్రభాస్ మూవీలోనూ కామెడీకి చోటుంది. చాలా యేళ్ళ తర్వాత ప్రభాస్ తో దర్శకుడు మారుతి కామెడీ చేయించాడు. ఇక చిరంజీవి, నయనతార జంటగా నటించిన 'మన శంకర్ వరప్రసాద్ గారు' మూవీలోనూ వినోదానికి పెద్ద పీట వేశారు. మాస్ ఆడియెన్స్ ను ఆకట్టుకునే ఫైట్స్ కూడా ఇందులో లేకపోలేదు. 13వ తేదీ వస్తున్న రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా ట్రైలర్ లోనూ ఎంటర్ టైన్‌మెంట్‌కే అగ్రతాంబూలం ఇచ్చారు.తాజాగా విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' ట్రైలర్ కూడా అదే కోవకు చెందింది. ఈ రెండు సినిమాల ట్రైలర్ లోనూ కమెడియన్ సత్య డామినేషన్ కనిపిస్తోంది. అలానే రెండు సినిమాల్లోనూ ఇద్దరేసి హీరోయిన్లు ఉండటం మరో కామన్ థింగ్. ఇక పెళ్ళికి ఎదిగిన కొడుకు ఉన్న తండ్రి కూడా మళ్ళీ ప్రేమలో పడటం, పెళ్ళి చేసుకోవడం, పిల్లలను కనాలనుకోవడం వంటి కాన్సెప్ట్ తో ఇటీవల కొన్ని సినిమాలు వచ్చాయి. తాజా ట్రైలర్ చూస్తే ఈ సినిమాలోనూ ఆ పాయింట్ కు ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలుస్తోంది.

# కలిసిరాని కోలీవుడ్

పొంగల్ సీజన్‌లో కోలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య విడుదలైన పరాశక్తి సినిమా మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్‌ను అందుకుంది. శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో విలన్‌గా రవి మోహన్, కీలక పాత్రలో అథర్వ కనిపించారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన శ్రీలీలకు ఇది కోలీవుడ్‌లో తొలి సినిమా కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే కథలో నిజాయితీ ఉన్నప్పటికీ, కథనం బలహీనంగా ఉండటం, స్క్రీన్‌ప్లే లోపాలు కనిపించడం వల్ల సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయిందనే అభిప్రాయం వినిపిస్తోంది. దీంతో 'జన నాయగన్ల వాయిదాతో ఏర్పడిన స్పేస్‌ని ఈ మూవీ ఫిల్ చేయలేకపోయింది. ఇక శ్రీలీల కెరీర్‌ను పరిశీలిస్తే అందం ఉన్నా అదృష్టం కలిసి రాకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. తొలి సినిమా విడుదల కాకముందే వరుస అవకాశాలు దక్కించుకున్న హీరోయిన్‌గా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అందరితో నటించినప్పటి కీ, 'ధమాకా', 'గుంటూరు కారం' తర్వాత ఆమె చేసిన సినిమాలన్నీ వరుసగా పరాజయాల పాలవ్వడం అభిమానులను నిరాశపరుస్తోంది. టాలీవుడ్‌లో వరుస ఫ్లాపుల తర్వాత, కోలీవుడ్‌లో అదృష్టం పరీక్షించుకోవాలని శ్రీలీల చేసిన ప్రయత్నమే 'పరాశక్తి'. సుధా కొంగర లాంటి కంటెంట్ ఓరియెంటెడ్ దర్శకురాలి సినిమాలో అవకాశం రావడంతో, ఈ సినిమా తన కెరీర్‌ను మలుపు తిప్పుతుందనే నమ్మకం ఆమెతో పాటు అభిమానుల్లోనూ ఉంది. ఈ పాత్ర కోసం లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం, యాక్టింగ్‌పై మరింత ఫోకస్ పెట్టడం వంటి ప్రయత్నాలు చేసినా ఫలితం మాత్రం ఆశించినట్లుగా రాలేదని టాక్. ముఖ్యంగా సుధా కొంగర సినిమాల్లో హీరోయిన్లు చాలా పవర్‌ఫుల్‌గా కనిపిస్తారనే పేరు ఉండగా 'రత్నమాల' పాత్రలో శ్రీలీల అంత ప్రభావం చూపలేకపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.





# పాజిటివ్ టాక్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. భారీ అంచనాల నడుమ తెరకెక్కిన ఈ సినిమాను దర్శకుడు అనిల్ రావిపూడి పూర్తిస్థాయి కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. చిరంజీవికి జోడీగా లేడీ సూపర్‌స్టార్ నయనతార నటించగా, వెంకటేష్ ప్రత్యేక కేమియో సినిమాపై ఉన్న క్రేజ్‌ను మరింత పెంచింది. ఆదివారం రాత్రి జరిగిన ప్రీమియర్ షోలతోనే సినిమాకు పాజిటివ్ టాక్ మొదలైంది. ముఖ్యంగా చిరంజీవి వింటేజ్ ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్, డైలాగ్ డెలివరీ అభిమానులను ఫుల్‌గా అలరిస్తున్నాయని టాక్ వినిపిస్తోంది. అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుండగా, వెంకటేష్ కేమియో సీన్స్ థియేటర్లలో విజిల్స్ వేయిస్తున్నాయని రివ్యూలు చెబుతున్నాయి. నయనతార పాత్రకు సరైన వెయిటేజ్ ఇవ్వడం కూడా సినిమాకు ప్లస్ పాయింట్‌గా మారింది.